క్లుప్తంగా

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు

కొందుర్గు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని లాల్‌పహాడ్ కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బయటకు వెళ్లొద్దని సూచించారు. తాజా కూరగాయలనే వాడాలని, వంట పాత్రలపై మూతలు సరిగా ఉండేలా చూడాలన్నారు.

యాదగిరిగుట్ట అభివృద్ధిపై ఆదేశాలు హర్షణీయం

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చెర్మన్ మహేందర్‌ముదిరాజ్

మొయినాబాద్‌రూరల్: యాదగిరి గుట్ట దేవాలయ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షిందగ్గ విషయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట దేవాలయంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని, వెంటనే అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలుపడం భక్తులకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. అదేవిధంగా టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట దేవాలయ బోర్డు ఏర్పాటు, దేవాలయంలో రాజ గోపురానికి బంగారు తాపడం, మిగిలి ఉన్న పనులు వేగవంతం చేయాలని దీనిపై రిపోర్టు ఇవ్వాలని అక్కడి అధికారులను కోరినట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదాన శిబిరం

షాద్‌నగర్: వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు కేసీ గుప్తా జయంతిని పురస్కరించుకొని ఆదివారం షాద్‌నగర్‌లో క్లబ్ అధ్యక్షుడు గుడిపల్లి వెంకటరమణ, వనితా క్లబ్ అధ్యక్షురాలు కొండ రమ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో సాయివాణి ఆస్పత్రి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 40 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. అదేవిధంగా చటాన్‌పల్లిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలకు ఎంపీఎస్ రంగయ్య సహకారంతో వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకును బహూకరించారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సూరిశెట్టి నర్సింహాగుప్తా, ఎంపీఎస్ సురేశ్, మాణిక్యం, దొండు పాండు రంగయ్య, వాడకట్టు విజయ్‌కుమార్, ఎల్కుర్తి శ్రీనివాస్, పాలాది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లను నిలపాలని వినతి

శంకర్‌పల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లను నిలిపేలా చూడాలని కోరుతూ ఆదివారం పట్టణ బీజేపీ నాయకులు చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. శంకర్‌పల్లి గుండా వెళ్లే బీజాపూర్, వాడి, హుబ్లీ–సికింద్రాబాద్, ఎల్‌టీటీ రైళ్లు వెళ్తాయని, వాటిని స్టేషన్‌లో ఆపితే ప్రతి నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీకి బీజేపీ నాయకులు సూచించారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించి, వెంటనే రైల్వే జీఎంతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాములు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, నర్సింలు, బయ్యన్న, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర మఫిషియల్(గ్రామీణ) జర్నలిస్టు కమిటీ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు గుడిపల్లి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆదివారం సూర్యాపేటలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మఫిషియల్ జర్నలిస్టు కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా సీనియర్ పాత్రికేయులు గుడిపల్లి శ్రీనివాస్‌ను నియమించినట్లు రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ ప్రకటించారు. అనంతరం రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామానారాయణ, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నగునూరి శేఖర్ నూతన కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

వాగులు, చెరువుల వద్దకు వెళ్లొద్దు

షాద్‌నగర్‌రూరల్: వర్షాకాలం ప్రమాదాల బారిన పడకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ విజయకుమార్ సూచించారు. భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్న ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి, నాగులపల్లి వాగులను ఆదివారం పట్టణ సీఐ విజయకుమార్ పరిశీలించారు. వరద ఉధృతిని స్థానికులను అడిగి తెలుసుకున్నారు.


మోకిల గేటెడ్ కమ్యూనిటీలో వర్షపు నీటిని బయటకు పంపేందుకు ప్రయత్నిస్తున్న ప్రజలు


కొందుర్గు: గుర్రంపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు


కొందుర్గు: కాజ్‌వేపై నుంచి పారుతున్న టేకులపల్లి వాగు

ఎడతెరిపిలేకుండా..

రెండురోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈసీ, మూసీ వాగులకు వరద పోటెత్తడంతో చెరువులు, కుంటలకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. చెరువులు, వాగుల వద్ద అధికారులు బందోబస్తు చర్యలు చేపట్టారు. వాగులు పార్లి కాజ్‌వేలపై నీరు ప్రవహించడంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. రోడ్లపై భారీగా వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పలు గ్రామాల్లో ఇల్లు కూలిన బాధితులను మున్సిపల్ సిబ్బంది పునఃరావాస కేంద్రాలకు తరలించారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, కాల్వల్లోని చెత్తను తొలగించారు. పంటచేలను వరద ముంచెత్తడంతో పంటలు దెబ్బతిన్నాయి. అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పోలీసులు ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను, వాగుల వద్ద ఉధృతిని పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.


కేశంపేట: తొమ్మిదిరేకులలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


చేవెళ్ల: ధర్మసాగర్ సమీపంలో పొంగిపొర్లుతున్న వాగు


చేవెళ్ల: ఆలూరు సమీపంలో పెద్దవాగు ప్రవాహం


షాద్‌నగర్‌రూరల్: చెరువును తలపిస్తున్న వెలిజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ


మొయినాబాద్‌రూరల్: చిన్నమంగళారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు


కేశంపేట: కాకునూర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి రమాదేవి


చేవెళ్ల: గొల్లపల్లి సమీపంలో వరి పొలంలో చేరిన వర్షపు నీరు


శంకర్‌పల్లి: మోకాళ్లలోతు నీటిలో ఇంటికి చేరుకుంటున్న వృద్ధుడు


నందిగామ: వాగును పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తహసీల్దార్ రాజేశ్వర్


కొందుర్గు: అలుగు పారుతున్న గుర్రంపల్లి చెరువు


మొయినాబాద్: వెంకటాపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు


షాబాద్: తాళ్లపల్లి వద్ద నిండుగా ప్రవహిస్తున్న ఈసీ వాగు


మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు


శంకర్‌పల్లి: ప్రొద్దటూరు వద్ద కూలీలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న మోకిల పోలీసులు


శంకర్‌పల్లి: ఫత్తేపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ


శంకర్‌పల్లి: ఫత్తేపూర్ బ్రిడ్జి కింద నీరు వెళ్లేందుకు కాల్వ తీస్తున్న సిబ్బంది


షాబాద్: ఉధృతంగా ప్రవహిస్తున్న మీరాపూర్ వాగు


షాబాద్: చర్లగూడ, మీరాపూర్ వాగు ఉధృతంగా పారడంతో నీట మునిగిన పంటలు


షాబాద్: రేగడిదోస్వాడ వాగు వద్ద నిలిచిన రాకపోకలు


షాద్‌నగర్: వెలిజర్లలో కూలిన ఇల్లు


షాద్‌నగర్‌రూరల్: వరదనీటిలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న కార్మికులు


కేశంపేట: లింగంధన గ్రామ శివారులో ఉన్న వాగును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకురావాలని సూచించారు. ఆయా మండలాల్లో గ్రామాల సమీపంలో ఉన్న వాగులు కూడా పొంగి ప్రవహిస్తున్నాయని వాటిని దాటేందుకు ప్రయత్నం చేయకూడదన్నారు. పిల్లలను బయటకు పంపించకుండా చూసుకోవాలన్నారు. వర్షానికి తడిసిన పాత ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉంటుందని, వాటిలో నివసించే వారు ముందు జాగ్రత్తగా ఆ ఇళ్లను ఖాళీ చేయడం మంచిదన్నారు. అవసరమైతే ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీలలో వసతి పొందాలన్నారు. నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని పలు వాగులను, చెరువులను పరిశీలించారు. ప్రజలు అత్యవసరమైతే వెంటనే అధికారులు, పోలీసులను సంప్రదించాలన్నారు.


నాగరగూడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వరద ప్రాంతాల పరిశీలన

మొయినాబాద్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరదల పరిస్థితిని అధికారులు పరిశీలించారు. ఆదివారం మండల పరిధిలోని చిలుకూరు, పెద్దమంగళారం, మేడిపల్లి గ్రామాలను డీపీఓ సురేశ్‌మోహన్, ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ తదితరులు పర్యటించి వరద పరిస్థితులను సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని డీపీఓ సూచించారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: భారీ వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోయి, పంటలు దెబ్బతిన్న నిరుపేద కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీఇచ్చారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. వర్షాలకు చెరువులకు గండ్లు పడ్డాయని, పలు గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. కొన్ని గ్రామాల్లో పేదలకు సంబంధించిన కొన్ని ఇళ్లు కూలిపోయినట్లు, మరికొన్ని గ్రామాల్లో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. అదేవిధంగా వరద కారణంగా రైతులు వేసిన పంటలు కూడా దెబ్బతిన్నట్లు తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులను, ఇళ్లు కూలిపోయిన బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి బాధిత కుటుంబాల ఇంటికి వెళ్లి వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇళ్లు కూలిన పోయినవారికి పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చేపల వేటకు, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వద్దకు ఎవరూ వెళ్లొద్దని సూచించారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

తీరిన వాల్మీకికాలనీ సమస్య

ఇళ్లలోకి నీళ్లు రాకుండా చర్యలు చేపట్టిన అధికారి


కాలనీలోకి వస్తున్న వర్షపు నీటికి అడ్డుకట్ట వేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి లాలయ్య

సాక్షి ఎఫెక్ట్

కొందుర్గు: 'ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయి' అంటూ సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొందుర్గు వాల్మీకి కాలనీలో పంచాయతీ కార్యదర్శి బాబయ్య పర్యటించి ఇళ్లలోకి వస్తున్న వర్షపునీటికి అడ్డుకట్టలు వేయించారు. రోడ్లపై మూసుకుపోయిన మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయించారు. ప్రస్తుతం తాత్కాలికంగా నీళ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నామని, మాలకుంట నీళ్లు శాశ్వతంగా కాలనీలోకి రాకుండా వారం రోజుల్లో పరిష్కారం చేస్తామని ఎంపీఓ లాలయ్య తెలిపారు.